టిడ్కో ఉచిత ఇళ్లను మరిచారా?


భీమవరంలో అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్లు

సీఎం జగన్ ఇచ్చిన హామీకి ఐదేళ్లు


పోలంగిలో ఇలా (ఫైల్)

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఏపీ టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తామంటూ గత ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోండి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే రుణాలు చెల్లిస్తుంది. ఇది మీ జగనన్న హామీ అంటూ భీమవరంలో ప్రకటించారు. కానీ ఎన్నికల హామీని నెరవేర్చలేకపోయారు. మళ్లీ ప్రస్తుత ఎన్నికల్లో భాగంగా బస్సు యాత్రలో సీఎంగా భీమవరం వస్తున్నారు. గతంలో జగన్ ఇచ్చిన హామీలను నియోజకవర్గ ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. ఇచ్చిన హామీని కాకుండా వైసీపీ ప్రభుత్వం కేవలం 300 చదరపు అడుగుల ఇళ్లకే పరిమితం చేసింది. అదే 365, 430 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లకు రాయితీ వరకే పరిమితం చేశారు. ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. దీనివల్ల లబ్ధిదారులపై దాదాపు రూ.4.65 లక్షల భారం పడింది. బ్యాంకు రుణాలు చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే 75 శాతం నిర్మాణం పూర్తయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల వరకు రాయితీ ఇచ్చాయి. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేలా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లబ్ధిదారులు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారు. మడమ తిప్పారు. కేవలం 300 చదరపు అడుగుల ఇళ్లకు మాత్రమే ఉచితం అమలుచేశారు. అంతేతప్ప 365, 430 చదరపు అడుగుల ఇళ్ల విషయంలో చేతులెత్తేశారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకున్నారు. ఇళ్లు అందజేయకుండానే బ్యాంకుల నుంచి వాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసే పరిస్థితి నెలకొంది.

టిడ్కో ఇళ్ల నిర్మాణం ఇలా

ఏపీ టిడ్కో భీమవరంలో 8,352, పాలకొల్లులో 6,144 ఇళ్లు, తాడేపల్లిగూడెంలో 5,376 ఇళ్లు నిర్మిస్తున్నారు. అందులో 300 చదరపు అడుగుల ఇళ్లు 6,944 ఉన్నాయి. వాటికే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. అదే 365, 420 చదరపు అడుగులకు సంబంధించి మూడు పట్టణాల్లో 12,249 ఇళ్లు ఉన్నాయి. వారందరికీ ప్రభుత్వం ఉచిత హామీ నెరవేర్చలేదు. బ్యాంకు రుణాలు చెల్లించాల్సి వస్తోంది.

రంగులకే పరిమితం

వైసీపీ హయాంలో రంగులు మార్చేందుకు ప్రభుత్వం పరిమితమైంది. ఉన్న రంగులను మార్చింది. తెలుపు, నీలం రంగులు అద్దింది. ఇందుకు కోట్ల రూపాయలు వెచ్చించింది. తెలుగుదేశం హయాంలో పూర్తి చేసిన ఇళ్లకు రంగులు మార్చడం వివాదాస్పదమైంది. తాడేపల్లిగూడెంలో 71 బ్లాక్‌లు, భీమవరంలో 32, పాలకొల్లులో 52 బ్లాక్‌లు టీడీపీ హయాంలోనే సిద్ధమయ్యాయి. ఒక్కో బ్లాక్‌లో 32 ఇళ్లు ఉన్నాయి.

ఏలూరు జిల్లాలో అస్తవ్యస్తం

ఏలూరులో టిడ్కో ఇళ్లు అధ్వానంగా మారాయి. ఇళ్లల్లో పుట్టలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయి. పిచ్చి చెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో పథకంలో 6,480 గృహాలు నిర్మాణాలను ప్రారంభించారు. 4,272 గృహాలు నిర్మాణం ఫౌండేషన్ స్థాయిలోనే ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి లబ్ధిదారులను భయపెట్టి జగనన్న కాలనీలో సెంటు భూమిని కట్టబెట్టారు. లబ్ధిదారులు 430 గజాల ఇళ్లకు రూ.లక్ష, 365 గజాల ఇళ్లకు రూ.50 వేలు, 300 గజాల గృహాలకు రూ.500 ప్రభుత్వానికి చెల్లించారు. బ్యాంకులలో వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్టు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం 300 ఎస్ఎఫ్‌టీ గృహాలు, 1104, 365 ఎస్ఎఫ్‌టీ గృహాలు 384, 400 ఎస్ఎఫ్‌టీ గృహాలు 720 కాగా మొత్తం 2,208 గృహాలే లబ్ధిదారులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అదికూడా మళ్లీ ఎన్నికల తర్వాతే లబ్ధిదారులకు అప్పగిస్తామని అధికారులు చెప్పడం గమనార్హం. నూజివీడులో సుమారు రూ.250 కోట్లు వ్యయంతో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీల పేరుతో 4,030 టిడ్కో జీ+3 ఇళ్లు మంజూర య్యాయి. ఇందులో లబ్ధిదారుడి వాటా చెల్లించిన వారికి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి 2,630 టిడ్కో జీ+3 గృహాలను దాదాపు 80 శాతం పూర్తి చేశారు. 2019 తొలి నాళ్లల్లో జీ+3 భవనాలను లబ్ధిదారులకు కేటాయింపు జరిగింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ టిడ్కో భవనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో భవనాల నిర్మాణం ఆగిపోయింది. నిర్మాణాలపై తెలుగుదేశం, జనసేన, వామపక్ష పార్టీలు ఆందోళన బాట పట్టడంతో ఫిబ్రవరి మొదటి వారంలో గత టీడీపీ హయాంలోనే పూర్తయ్యి రంగులు వేసిన భవనానికి వైసీపీ రంగులు వేసి భవన నిర్మాణాలు వేగంగా, తమ హయాంలో జరుగుతున్నట్టు చూపే ప్రయత్నం చేయడం గమనార్హం. జంగారెడ్డిగూడెంలో 2016లో 864 టిడ్కో గృహసముదాయాల నిర్మాణం మొదలుపెట్టారు. 2019 ఎన్నికలు సమీపించే సమయానికి నిర్మాణాలు చివరి దశకు వచ్చాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాకా నేటి వరకు మిగిలిన నిర్మాణ పనులు అడుగు ముందుకు కదల్లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తేదీలు మార్చుకుంటూ ప్రజలను మభ్యపెట్టారు.

అప్పట్లోనే రంగులు వేశారు. అవి ఆకర్షణీయంగా ఉన్నాయి. సదరు ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి మూడేళ్లు పట్టింది. ఆ తర్వాత మరో నాలుగు వేలు ఇచ్చారు. ఇప్పటికీ లబ్ధిదారులు ఆ ఇళ్లలోకి వెళ్లలేదు. పూర్తిస్థాయి వసతులు లేకుండానే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. వారి చేతిలో పట్టాలు పెట్టారు.

లబ్ధిదారుల వాటాలోనూ అంతే..

ప్రభుత్వం 365, 430 చదరపు అడుగులకు సంబంధించి లబ్ధిదారుల వాటాలో కొంత రాయితీ ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి 365 చదరపు అడగుల ఇళ్ల లబ్ధిదారులు రూ. 50 వేలు, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు రూ.లక్ష వంతున చెల్లించారు. అందులో చెరి సగం ప్రభుత్వం తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఇప్ప టికీ లబ్ధిదారుల వంతులో ప్రభుత్వం సొమ్ములు మంజూరు చేయలేదు. బ్యాంకుల నుంచి లబ్ధిదారులపై ఒత్తిడి పెరుగుతోంది.

శ్రావణంలో గృహ ప్రవేశం : చంద్రబాబు

తెలుగుదేశం అధికారంలోకి వస్తే శ్రావణ మాసంలోనే ఇళ్లల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు పాలకొల్లు సభలో హామీ ఇచ్చారు. వాస్తవానికి క్రీడా మైదానాలు, పార్క్‌లు వంటివి ఏర్పాటు చేయాలని టీడీపీ సంకల్పించింది. అవన్నీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారు. కనీస వసతులు కల్పించలేకపోయారు. టిడ్కో ఇళ్లు చిట్టడవులను తలపిస్తున్నాయి. మళ్లీ ఎన్నికల సభకు సీఎం జగన్ వస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు.


పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

హైవేలోనూ జనానికి తిప్పలే

సీఎం జగన్ పర్యటనలో భారీ భద్రత

- బస్సులో నుంచి కదలకుండానే చేతులూపిన జగన్.. హైవేపై 'ఫ్యాన్' కార్యకర్తలకు చుక్కలు
- జనం పల్చగా, వాహనాల శ్రేణి పెద్దగా..

పెదవేగి/పెదపాడు/ఏలూరు క్రైం/దెందులూరు/భీమడోలు/ఉంగుటూరు, ఏప్రిల్ 15 : మేమంతా సిద్ధం పేరిట సీఎం జగన్ ఎన్నికల ప్రచారయాత్ర ఏలూరు జిల్లాలో అడుగిడింది. బస్సులో సీఎం జగన్ ప్రయాణిస్తుండగా ఆయన వెంటే పెద్దసంఖ్యలో వాహనాలు అనుసరించాయి. గులకరాయి దాడి తర్వాత కనీవిని ఎరుగని రీతిలో భద్రతా బలగాల మధ్య సోమవారం రాత్రి హనుమాన్ జంక్షన్ నుంచి నారాయణపురం వరకు సీఎం జగన్ బస్సులో ప్రయాణించారు. ఏలూరు జిల్లా సరిహద్దు అప్పనవీడు దాటి హైవేలో ప్రవేశించిన కాన్వాయ్ కలపర్రు టోల్‌గేట్ వద్ద కొన్ని నిమిషాలపాటు ఆగింది. అప్పటికే ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల నుంచి కొద్దిపాటి సంఖ్యలో కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరిగి 48 గంటలు దాటిన తర్వాత పోలీస్, భద్రతా బలగాలు పెద్దఎత్తున మోహరించాయి. గతంలో మాదిరిగా కాకుండా వైసీపీ వారైనా ఎక్కడ లేని జాగ్రత్తలు తీసుకున్నారు. ఉత్సాహంతో ముందుకెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను నిలువరించారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద అప్పటికే ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి కార్యకర్తలు వెంటరాగా అక్కడకు చేరుకున్నారు. వారిద్దరు సీఎం ప్రయాణిస్తున్న బస్సులోకి వెళ్లారు. ఆపై జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బస్సు ఎదుటే సీఎం జగన్‌కు గుమ్మడికాయ దిష్టి తీశారు. జడ్పీ చైర్‌పర్సన్ హోదాలో పద్మశ్రీని మాత్రమే ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అనుమతించారు. మిగతా వారిని బస్సు సమీపంలోకి రానీయకుండా నెట్టివేశారు. ఉన్న కొద్దిపాటి కార్యకర్తలకు ఈ చర్యలు రుచించలేదు. కలపర్రు టోల్‌గేట్ వద్ద మాత్రమే జనం పల్చగా హాజరయ్యారు. ఆ తర్వాత సీఎం కాన్వాయ్


కలపర్రు టోల్‌గేట్ వద్ద కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

హైవేపై దూసుకుపోయింది. ఇంతకు ముందు కొద్దిపాటి మందే కార్యకర్తలు ఉన్నా వారిని చూసి అభివాదం చేసే సీఎం ఈసారి బస్సులోనే ఉండిపోయారు. ప్రత్యేకించి ఆయన ప్రయాణిస్తున్న మార్గం జాతీయ రహదారి కావడంతో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి, దెందులూరు క్రాస్ రోడ్డు, కొవ్వలి క్రాస్‌రోడ్డు, సత్యనారాయణపురం.. ఎక్కడా కూడా ఆగకుండానే హైవే మీదే ముందుకు సాగారు. సర్వీస్ రోడ్లలోను ఎక్కడా జనమే కనిపించలేదు. రాత్రివేళ కావడంతో వీరంతా ముందస్తుగా కలపర్రు టోల్‌గేట్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు వెళ్ళినట్టు వైసీపీ నేతలు మాట ఏమార్చారు. లంకల గ్రామాలకు చెందిన కొద్దిపాటి మందిని గుండుగొలను జంక్షన్‌కు జగన్ రాకకు కొన్నిగంటల ముందే స్థానిక నేతలు రప్పించారు. ఎక్కడా ప్రసంగాలు, ఓదార్పులు లేకుండానే నిర్ణీత వ్యవధికంటే జగన్ పర్యటన గంటన్నర ఆలస్యంగా సాగింది. దీంతో వచ్చిన కొద్దిమంది గంటల తరబడి వేచిఉండాల్సి వచ్చింది. భీమడోలు రైల్వే క్రాసింగ్ వద్ద వేచిఉన్న కొద్దిపాటి జనాన్ని కూడా జగన్‌ను కలవనీయకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. పూళ్ళ సెంటర్‌లోనూ కాస్తో కూస్తో జనం ఉన్నా సీఎం కాన్వాయ్ ముందుకే సాగింది. కైకరం, నారాయణపురం జంక్షన్లలో రాత్రి హైవే మీదే సీఎం కోసం పడిగాపులు పడడమే కాకుండా విపరీతమైన భద్రతా కారణాల దృష్ట్యా అటు నుంచి ఇటు, ఇటు నుంచి ఎవరినీ కలవనీయకుండా చేశారు. హనుమాన్ జంక్షన్ నుంచి కైకరం వరకు సుమారు 51 కిలోమీటర్లు గంటంపావు వ్యవధిలోనే సీఎం కాన్వాయ్ ప్రయాణించింది.


భీమడోలులో అరకొరగా వున్న జనానికి బస్సులో నుంచే జగన్ అభివాదం

నారాయణపురం టు ఈతకోట

- ఉమ్మడి పశ్చిమలో సీఎం జగన్ బస్సు యాత్ర.. నేడు భీమవరంలో సిద్ధం సభ
- నియోజకవర్గానికి 150 బస్సులు.. పది వేల మంది తరలించాలని ఆదేశాలు
- ఆర్టీసీ నుంచి 140 బస్సుల కేటాయింపు

భీమవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం భీమవరంలో 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకున్న సీఎం సోమవారం రాత్రి బస ఇక్కడే చేయనున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నారాయణపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. నిడమర్రు, భువనపల్లి మీదుగా పది గంటలకు గణపవరం చేరుకుంటుంది. తర్వాత సరిపల్లె, కోలమూరు మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు ఉండి చేరుకుని మధ్యాహ్న భోజనం చేస్తారు. అక్కడి నుంచి సాయంత్రం నాలుగు గంటలకు యాత్ర ప్రారంభించి 4.30 గంటలకు భీమవరం చేరుకుంటారు. బైపాస్ రోడ్‌లోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించేందుకు అధికార పార్టీ నేతలు తలమునకలయ్యారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 150 బస్సుల్లో జనాన్ని తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీకి ఇచ్చేందుకు ఆర్టీసీ సైతం 140 బస్సులను కేటాయించింది. ప్రతి నియోజకవర్గం నుంచి పది వేల మందికి తక్కువ కాకుండా జనం హాజరయ్యేలా చూడాలని అధిష్ఠానం నుంచి ఆదేశాలందాయి. ఇందు కోసం అభ్యర్థులంతా ఆపసోపాలు పడుతున్నారు. భీమవరంలో సభ అనంతరం గరగపర్రు-ఉణుదుర్రు, ముదునూరు రావిపాడు మీదుగా బస్సు యాత్ర తణుకు చేరుతుంది. తణుకు వై.జంక్షన్ నుంచి పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఈతకోటకు చేరుకుని అక్కడ రాత్రి బస చేస్తారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

ఉండి, ఏప్రిల్ 15 : సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ వి.రజిత తెలిపారు. సోమవారం ఉండి కోట్ల ఫంక్షన్ హాలులో సీఎం బస్సు యాత్రకు సంబంధించి పోలీసులకు అవగాహన కల్పించారు. సీఎం భద్రతకు సుమారు 1500 మంది పోలీసులను ఏర్పాటు చేశారు.

హైవేలోనూ తప్పని తిప్పలు..

ఇంతకు ముందు నిర్దేశించిన కార్యక్రమం ప్రకారం గుడివాడ, భీమవరం మార్గంలో సీఎం జగన్ మేమూ సిద్ధం యాత్ర చేయాల్సి ఉంది. కానీ సీఎంపై గులకరాయి దాడి జరిగిన తర్వాత షెడ్యూల్ మార్చారు. హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు జిల్లాలోకి కాన్వాయ్ రూట్‌ను మళ్లించారు. దీంతో సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు హైవేలోనే జనం తిప్పలు పడక తప్పలేదు. సీఎం ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు, ప్రైవేట్ వాహనాలకు మధ్య ముప్పావుగంట వ్యవధి ఉండేలా పోలీసులు జాగ్రత్తలు పడడంతో ప్రయాణికులు చుక్కలు చూశారు. ఆఖరికి సర్వీసు రోడ్లలోనూ వాహనాలను వెళ్లనీయకుండా అత్యుత్సాహంతో నిలువరించారు.

టీచర్ల వైద్యబిల్లుల చెల్లింపునకు లైన్‌క్లియర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 : ఉద్యోగ, ఉపాధ్యాయుల వైద్యబిల్లుల మంజూరు, చెల్లింపు (రీయింబర్స్‌మెంట్)పై ఖజానా శాఖ అధికారులు పెడుతున్న అభ్యంతరాలను పరిష్కరిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యబిల్లులను ఆమోదిస్తూ గతంలోనే వైఎస్సార్ ట్రస్ట్ ఉత్తర్వులు జారీచేయగా, వాటిని తిరస్కరిస్తూ సంబంధిత శాఖల హెచ్‌వోడీల నుంచి మంజూరు ఉత్తర్వులు జారీ అయితేనే చెల్లింపులు జరుగుతాయని ట్రెజరీ అధికారులు మెలిక పెట్టారని వివరించారు. ఈ సమస్యపై పీఆర్టీయూ చేసిన అభ్యర్థన మేరకు పాఠశాల విద్యలో పెండింగ్‌లో వున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల్లో తొలివిడతగా 1,350 మంది టీచర్ల బిల్లులు చెల్లించాల్సిందిగా కమిషనర్ ఉత్తర్వులిచ్చారన్నారు. ఉత్తర్వులను ఎంఈవోలు/ హెచ్‌ఎంల లాగిన్‌లకు పంపినందున సీఎస్ఈ ప్రొసీడింగ్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులను స్థానిక ఖజానాశాఖ అధికారులకు మంజూరు, చెల్లింపు నిమిత్తం టీచర్లు అందజేయాలని కోరారు.

ఇరిగేషన్ ఎస్ఈగా రవిబాబు



ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 : ఏలూరు జలవనరుల శాఖ ఏలూరు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఎం.ఎస్. ఎస్ రవిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

చింతలపూడి, ఏప్రిల్ 15 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వైపే తమంతా ఉన్నామని జిల్లాలోని పామాయిల్ రైతులు స్పష్టం చేశారు. ఏలూరు ఎంపీ స్థానం కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ చింతలపూడి మండలం ఊటసముద్రంలో పామాయిల్ రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలను ఆసాంతం విన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. క్రూడాయిల్ దిగుమతితో సంబంధం లేకుండా పామాయిల్ టన్నుకు గిట్టుబాటు ధరను అందిస్తామన్నారు. తనను పార్లమెంట్‌కు పంపిస్తే అక్కడ పామాయిల్ సమస్యలు వివరించి కేంద్రంతో మాట్లాడి ప్రతీ మూడేళ్లకు ఒకసారి గిట్టుబాటు ధర పెరిగేలా కృషి చేస్తామన్నారు. మొక్కలు కొనుగోలులో ప్రభుత్వం నుంచి సబ్సిడీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. పామాయిల్ పంటను మన రాష్ట్రానికి తీసుకొచ్చింది మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు అని అన్నారు. అనంతరం చంద్రబాబు పామాయిల్ పంట అభివృద్ధికి కృషి చేశారన్నారు. చంద్రబాబు 33 నెలల మ్యాచింగ్ గ్రాంట్ రైతులకు ఇచ్చారని దాన్ని జగన్ రద్దు చేశాడన్నారు. మరలా మ్యాచింగ్ గ్రాంట్ పునరుద్ధరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, రైతులు రామారాజు, ఆచంట సూర్యనారాయణ, ముత్తారెడ్డి, పాల్గొన్నారు.


గంగన్నగూడెం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ యనమల

టీడీపీతోనే బీసీలకు న్యాయం : యనమల

దెందులూరు : 'బీసీలకు న్యాయం చేయగలిగే పార్టీ టీడీపీ మాత్రమే. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి' అంటూ మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ నేత యనమల రామ కృష్ణుడు పిలుపునిచ్చారు. దెందులూరు మండలం గంగన్నగూడెం శ్రీకృష్ణ కన్వెన్షన్ హాలులో సోమవారం ఏలూరు పార్లమెంట్ స్థానం పరిధిలోని యాదవ కులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. సమావేశానికి హాజరైన యనమల మాట్లాడుతూ బీసీలంతా ఐక్యతతో ఉండి టీడీపీ కూటమి విజ యానికి కృషి చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి


ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మహేష్ యాదవ్, రోషన్‌కుమార్‌ను సత్కరిస్తున్న పామాయిల్ రైతులు

పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ జగన్‌కు ఓటేస్తే మన ఆస్తులకు మన భూములకు గ్యారంటీ ఉండదని, తల్లి, చెల్లి కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేని జగన్‌ను మళ్లీ నమ్మితే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోతుందన్నారు. బీసీ కులా లతో పాటు యాదవుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసి, అధికారంలో అగ్రభాగం అవకాశం కల్పించిన తెలుగుదేశం కూటమికే మా మద్దతు పలుకుతామని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ ముమ్మడి సక్కు కుమారి, చింతయ్య యాదవ్, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు ప్రకటించారు. దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు నాగనబోయిన సత్యనారాయణ, జమలయ్య యాదవ్, వెంకటేశ్వరావు, మహేష్ యాదవ్, నున్న లక్ష్మణ్, ముమ్మడి వినయ్ యాదవ్, కొలుసు నాని, వేగివాడ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు (సర్కిల్‌లో)

వైసీపీ సమావేశంలో వలంటీర్లు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన గ్రామ వలంటీర్లు అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొం టున్నారు. ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేస్తున్నా, ఎన్నికల సంఘం వద్దని చెబుతున్నా ఏదో కార్యక్రమంలో పాల్గొంటూనే ఉన్నారు. సోమవారం సారథి ఫంక్షన్ హాల్లో జరిగిన వైసీపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అయితే ఈ సమావేశానికి పలువురు వలంటీర్లు హాజరు కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాల్వలు కట్టేలోపు మంచినీటి వనరులన్నింటినీ నింపుకోవాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 15 : కాల్వలు కట్టే లోపు జిల్లాలోని మంచినీటి వనరులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన నింపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వేసవి తాగునీటి సరఫరా, ఎన్నికల సంసిద్ధతపై అధికారులతో సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

నేడు ప్లేస్‌మెంట్ డ్రైవ్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 15: ఉద్యానవన పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి నూజివీడు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాలల్లో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మామిడి పరిశోధనా కేంద్రంలో అంతర్భాగంగా నడుస్తున్న నూజివీడు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గోద్రెజ్ ఆగ్రో టెక్ సంస్థ రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందన్నారు.

20న విర్డ్‌లో ఉచిత న్యూరో క్యాంప్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఈనెల 20న నిర్వహిస్తున్న శిబిరానికి ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ సతీష్ విచ్చేసి వైద్య సేవలు అందిస్తారని ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. వెన్నుముఖకు సంబంధించిన సమస్యలపై బాధపడేవారికి ఇక్కడ ఉచిత వైద్యసేవలు లభ్యమవుతాయని వివరించారు. వెన్నెముఖ జారిపోవడం, పక్కకు జారడం, విరగడం, మెడ, నడుము, వెన్నెపూస సమస్యలపై బాధపడేవారు ఈ అవకాసాన్ని సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. వైద్యసేవల కోసం ముందుగా 85002 63149 న ంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ముగ్గురు డీవైఈవోల నియామకం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా వున్న మూడు డివిజన్లకు ఉపవిద్యాశాఖాదికారు (డీవైఈవో)లను నియమిస్తూ పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (కాకినాడ ఆర్జేడీ) సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఎంఈవో-1లనే డీవైఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలపై (ఎఫ్‌ఏసీ) నియమించడం గమనార్హం. ఏలూరు డీవైఈవోగా ఏ.రవిప్రకాష్ (ఏలూరు ఎంఈవో), తణుకు డీవైఈవోగా డి.మురళీ సత్యనారాయణ, భీమవరం డీవైఈవోగా పాలకోడేరు ఎంఈవో పి.వెంకట శివనాగరాజులను నియమించారు. ఈ మూడు డివిజన్లకు ఉపవిద్యాశాఖాధికారులు లేకపోవడంతో టీచర్లకు సంబంధించిన వివిధ పనులు, నాడు-నేడు పర్యవేక్షణ, పరీక్షల నిర్వహణ తదితర కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలుగుతున్న విషయం విధితమే. సాధారణ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకే ఈ డివిజన్లకు రెగ్యులర్ డీవైఈవోలను నియమిస్తారు.

10,442 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 15 : జిల్లాలో ప్రస్తుత రబీ పంటకు సంబంధించి ఇంతవరకు 873 మంది రైతుల వద్ద నుంచి రూ.15.65 కోట్ల విలువైన 10,442 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి అనుసంధానం చేయబడిన రైస్ మిల్లులకు ర్యాండమ్ సెలక్షన్ ద్వారా తరలించినట్టు జేసీ లావణ్యవేణి తెలిపారు. ఇప్పటివరకు 2751 మంది రైతులకు చెందిన 27,356 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించడానికి నమోదు చేసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో 120 ఆర్‌బీకేలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 66 సహాయక కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ధాన్యం కొనుగోలుపై ఫిర్యాదులను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910 తెలపవచ్చన్నారు.



తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆంధ్ర-తెలంగాణ ఎస్ఈబీ అధికారుల సమావేశం

పరస్పర సహకారంతో మద్యం అక్రమ రవాణా అరికట్టాలి

ఇరు రాష్ట్రాల ఎస్ఈబీ అధికారుల సమావేశం

జీలుగుమిల్లి, ఏప్రిల్ 15 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల ఎస్ఈబీ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో మద్యం అక్రమ రవాణా అరికట్టడానికి పరస్పర సహకారం అవసరమని భద్రాచలం ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.కారంచంద్ అన్నారు. తాటియాకులగూడెంలో ఆంధ్ర- తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఇరు రాష్ట్రాల ఎస్ఈబీ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు, ఆంధ్రలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. బూర్గంపాడు, కుక్కునూరు, ఏటపాక, చింతలపూడి, తాటియాకులగూడెం సరిహద్దు ప్రాంతాల్లో 24 గంటల పాటు పూర్తి నిఘా ఉంచామని అధికారులు చెప్పారు. ఎస్ఈబీ సీఐలు వై.పట్టాభి చౌదరి, కె.సాంబమూర్తి, రెహమున్నీసా, టీఎస్ఎస్‌వి ప్రసాద్, ఏఎంవీఐ సురేష్, ఈవోపీఆర్డీ నిఖిల్ మధుశరన్, ఎస్సైలు ఎలియాజర్, శేఖర్‌బాబు హెడ్ కానిస్టేబుళ్లు సిబ్బంది ఉన్నారు.



గుడ్లవల్లేరు-ముదినేపల్లి ప్రధాన రహదారిపై మంటలు

గ్యాస్ పైప్‌లైన్ లీక్

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని పెనుమల్లిలో సోమవారం గ్యాస్ పైప్‌లైన్ లీకై మంటలు వ్యాపించి సమీపంలోని చెత్తకు అంటుకోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీస్, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమై గ్యాస్ సరఫరా నిలిపి వేశారు. సంబంధిత గ్యాస్ కంపెనీ అధికారులు మరమ్మతులు చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. పనులను మండవల్లి మండల తహసీల్దార్ పర్యవేక్షించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రకటనలో తెలిపారు.



15-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	244	225	235.30
జంగారెడ్డిగూడెం-1	245	235	241.41
జంగారెడ్డిగూడెం-2	247	235	242.35
కొయ్యలగూడెం	247	235	240.91
గోపాలపురం	246	235	240.67



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

చాలు..ఇక వెళ్లండి !

అధికార పార్టీ అభ్యర్థులకు చేదు అనుభవం
ప్రచారంలో నిలదీస్తున్న జనం
ముఖం చాటేస్తున్న సొంత కేడర్
కూటమి పార్టీల్లోకి జంపింగ్‌లు

అధికార పార్టీ అభ్యర్థులకు ప్రచారంలో చేదు అనుభవం ఎదురవుతోంది. అభివృద్ధిపై నిలదీస్తున్నారు. సొంత పార్టీ నాయకులే దూరంగా ఉంటున్నారు. తెలుగుదేశం లేదా జనసేనలో చేరిపోతున్నారు. ఆచంట నియోజకవర్గం వెలగలేరు గ్రామంలో కొందరు వైసీపీ నాయకులు తెలుగుదేశంలో చేవారు. వారిని తిరిగి వైసీపీలోకి రావాలంటూ అధికార పార్టీ నేతలు పిలుపునిచ్చారు. అదే గ్రామానికి రాకపోకలు నిర్వహించడానికి డ్రెయిన్‌పై వంతెన నిర్మిస్తామంటూ గత ఎన్నికల్లో వైసీపీ హామీ ఇచ్చింది. ఇప్పటికీ నెరవేర్చలేదు. దాంతో తాము ఇక వైసీపీకి మద్దతు ఇవ్వలేమంటూ గ్రామంలో కార్యకర్తలు తేల్చి చెప్పారు. దాంతో అప్పటికప్పుడు డ్రెయిన్‌లో తూరలు వేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పడమర విప్పర్రులో రహదారి వేయలేదంటూ ప్రచారానికి వెళ్లిన వైసీపీ అభ్యర్థి, మంత్రి కొట్టు సత్యనారాయణను స్థానికులు నిలదీశారు. పడమర విప్పర్రుకు వెళ్లాలంటే అంతా ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికార పార్టీ అభ్యర్థికి నిలదీయడంతో అంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మరోవైపు తాడేపల్లిగూడెం నుంచి వైసీపీని వీడుతున్న వారు పెరుగుతున్నారు. పట్టణంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పార్టీని వీడి జనసేనలో చేరుతున్నారు. కొందరు నాయకులు తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటున్నారు. తణుకులో బజార్‌కు వెళ్లిన వైసీపీ నేతకు చుక్కెదురైంది. తమకు కనీస వసతులు కల్పించలేదంటూ అంతా నిలదీశారు. ఐదేళ్లపాటు పట్టించుకోని మంత్రి అక్కడ కొత్త బజార్‌ను నిర్మించి ఇస్తామంటూ హామీ ఇచ్చారు. తణుకు నియోజకవర్గంలోనూ అధికార పార్టీని వీడుతున్న నాయకులు సంఖ్య పెరుగుతోంది. ముఖ్య నాయకులే పార్టీని వీడి కూటమిలో చేరిపోతున్నారు. కొందరు నాయులు మౌనం దాలుస్తున్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

నరసా పురంలో అధికార పార్టీ అభ్యర్థి ముదునూరి ప్రసాద్ రాజు కూటమి నాయకుల నుంచి విమర్శలు రాకుండా అన్ని ప్రయత్నాలు చేశారన్న వాదన వినిపించింది. కానీ తాజాగా అక్కడ సమీకరణలు మారిపోయాయి. ముదునూరిపై గడచిన ఐదేళ్ల నుంచి కంటిమీద కునుకులేకుండా చేస్తూ పోరాటం చేసిన నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు కూటమి అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేసేందుకు సిద్ధం అయ్యారు. ఆలా అక్కడ అధికార పార్టీ నేత ప్రణాళికలు చిత్తయ్యాయి. ఇక భీమవరం నియోజకవర్గానికి వస్తే గతంలో వైసీపీ కార్యకర్తలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చారు. అధికార పార్టీ నుంచి ఆర్థికంగా సహకారం అందడంతో అంతా పార్టీకి అండదండగా ఉన్నారు. అయితే వారంతా సొమ్ములు తీసుకుని పని చేశారంటూ గడచిన ఐదేళ్లనుంచి అధికార పార్టీ నేత నుంచి చీవాట్లు, ఛీత్కారాలు ఎదురయ్యాయి. దాంతో ఈ సారి కొందరు కార్యకర్తలు, నాయకులు భీమవరంలో ముఖం చాటేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ బంధువులు వెళ్లి కలుస్తుంటే మీకో దండం అంటూ ముఖం మీదే చెపుతున్నారంటూ ఇప్పుడు పార్టీలో చర్చగా మారింది.

ఉండిలో అంతా తమకు కలసి వస్తుందంటూ అధికార పార్టీ అక్కడ చంకలు గుద్దుకుంటోంది. ఒకవైపు ఉండి నియో జకవర్గంలో టీడీపీ అభ్యర్థి మార్పు, స్వతంత్ర అభ్యర్థి రంగంలో ఉండడంతో తమకు కలసి వస్తుందంటూ వైసీపీ సంబరపడిపోతోంది. కానీ ప్రచారంలోనే చతికిలబడిపోయింది. మరోవైపు ఉండిలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు గురిపెట్టారు. కూటమిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే రామరాజుకు సరైన న్యాయం చేస్తామంటూ సంకేతాలు పంపారు. మొత్తం పైన అక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లేలా కూటమి సన్నద్ధమవుతోంది.

92 శాతం ఓటింగ్ లక్ష్యం

జిల్లా నోడల్ అధికారి, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్
జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 15: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న స్వీప్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమాల గురించి, ఓటింగ్ శాతం పెంపునకు చేపట్టిన అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 2 వేలు స్వీప్ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. గత ఎన్నికలలో జిల్లాలో పోలింగ్ శాతం 83.10 శాతం కాగా, రాబోయే సార్వత్రిక ఎన్నికలలో 92 శాతాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. 85 సంవత్సరాలు దాటిన వారికి, దివ్యాంగుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హోం ఓటింగ్ జరుపనున్నామని ఆయన చెప్పారు. జిల్లాలో అత్యల్పంగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 68.54 శాతం పోలింగ్ నమోదైందని, దీనికి కారణం ఈ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైనవారు ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేయడం, చదువులు నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉండటం వల్ల పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటు ద్వారా జరుగుతుందని, సమాజాభివృద్ధికి, వ్యక్తి భవిష్యత్‌కు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 16.25 లక్షల ఓటర్లను దృష్టిలో ఉంచుకుని ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలలో కళాజాత కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు అమ్మ పిలుస్తుంది అనే సామాజిక చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆహ్వాన పత్రిక పంపి ఓటింగ్ ప్రక్రియలో భాగస్వాములు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రణాళిక, ఆర్థికసంఘ కమిటీలు, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యసేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, ఉపాధి హామీ పనులు, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ పనులు, తాగునీరు, విద్యుత్, రబీ సీజన్‌లో ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు తదితర అభివృద్ధి అంశాలపై చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి విధాన నిర్ణయాలు తీసుకోకుండానే సమావేశం ముగించారు.



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ పద్మశ్రీ, జిల్లా అధికారులు



విద్యుద్దీపాలంకరణలో ఆలయం.. ప్రత్యేక అలంకరణలో క్షీరా రామలింగేశ్వర స్వామి

రేపటి నుంచి క్షీరా రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

పాలకొల్లుఅర్బన్, ఏప్రిల్ 15 : పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈనెల 17 తేదీ బుధవారం నుంచి 23వ తేదీ మంగళవారం వరకూ వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. 17వ తేదీ అంకురార్పణ, 18 రాత్రి పార్వతీ సమేత క్షీరా రామలింగేశ్వర స్వామివారికి, లక్ష్మీ సమేత జనార్ధన స్వామివార్లకు వైభవంగ కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.19వ తేదీ శుక్రవారం సాయంత్రం స్వామివార్ల రథోత్సవం, 23వ తేదీ ఉదయం స్వామివార్ల త్రిశూల స్నానం, సాయంత్రం 6.45కు పుష్పోత్సవం నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. సోమవారం సందర్భంగా స్వామివారికి ఏక వార రుద్రాభిషేకాలు నిర్వహించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య

సేవే లక్ష్యంగా పనిచేయాలి

కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు జోగయ్య

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్, 15 : రాజకీయాలు మినహా సంక్షేమ సేవలు కొనసాగించడమే లక్ష్యంగా పనిచేయాలని కాపు, బలిజ సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామ జోగయ్య అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జోగయ్య మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న మూడు పార్టీలలో వైసీపీ కాపుల సంక్షేమానికి వ్యతిరేకమనే విషయం తెలిసిందేనని, గతంలో రిజర్వేషన్లు కల్పించలేమని చెప్పడంతో పాటు, తెలుగుదేశం హయాంలో ప్రభుత్వం ఇచ్చిన అగ్రవర్ణాల ఈబీసీ కోటాలో 5 శాతం రిజర్వే షన్లు కూడా రద్దు చేసిందన్నారు. ఇక తెలుగుదేశం పార్టీకి కూడా రిజర్వేషన్ల సమస్యపై చిత్తశుద్ధి ఉన్నట్టు కనపడటం లేదన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తాడనే నమ్మకంతో జనసేనకు మనం తెలియచేయాల్సి ఉందన్నారు. జనసేన పోటీ చేసే 21 అసెంబ్లీ స్థానాలను గెలిపించుకునేందుకు కృషిచేయాలని తీర్మానం చేసినట్టు జోగయ్య వివరించారు.



గణపవరంలో తనిఖీ రూ.99 వేలు స్వాధీనం

గణపవరం, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గణపవరంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సోమవారం ఎఫ్ఎస్టీ బృందం వాహనాలు తనిఖీ చేయగా రూ.99 వేలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలి పారు. రూ.50 వేలకు మించి నగదు ఉంటే వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు.



అంతా గప్ చిప్ : ఏలూరులో రోడ్లు నిర్మానుష్యం



ముసుగేయాల్సిందే..



మండే ఎండలు

బెంబేలెత్తుతున్న జనం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 15: ఎండలు మండిపోతున్నాయి. మాడులు మలమలమాడుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే భగభగలతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 9 గంటలకే ఉప్పెనలా ఎండలు ఆరంభమై సాయంత్రం 5 గంటల వరకు మంట పుట్టిస్తున్నాయి. ఎండాకాలం ఆరంభంలోనే ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరి ఎన్నడూలేని విధంగా అత్యధికంగా నమోదు అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం 40 డిగ్రీలు దాటింది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఏప్రిల్ 2వ వారంలోనే ఈ విధంగా ఎండలు ఉంటే మే నెలలో ఎలా ఉంటాయోనని బెంబేలెత్తుతున్నారు.ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు పైగా దాటిపోవడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లు అన్నీ నిర్మానుష్యంగా మారాయి. జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. ఏలూరులోని పలు ప్రాంతాల్లో ఎక్కడా రోడ్లపై జనసంచారం కనిపించలేదు. మధ్యాహ్నం 12 లోపే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు ఎండల సమయంలో బయటకు రావద్దని, అత్యవసరమైతే గొడుగు, టోపీ వంటివి ధరించి జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



చిన్నారుల కోసం..తాతయ్య కష్టం



పోలవరంలో రెండిళ్లు దగ్ధం

పోలవరం, ఏప్రిల్ 15 : పోలవరం పంచాయతీ గణేష్ నగర్ యానాది కాలనీలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగి రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు గమనించిన స్థానికులు నీళ్ళు పోసి ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేక పోయింది. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేస్తే వాహనం మరమ్మతులకు గురైందని జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయమని చెప్పారని స్థానికులు తెలిపారు. చేపల వేట కోసం వెళ్లి వచ్చేసరికి తమ ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయని సర్వం బూడిదై కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని బాధితులు గొలిసే రాజమ్మ, తుపాకుల రమణమ్మ వ్యక్తం చేశారు. ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ప్రసాద్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అప్పారావు బాధితులకు వంట సామాగ్రి, కిరాణా సామాన్లు అందించారు.

క్రైం కార్నర్

అర్ధరాత్రి మహిళపై దాడి

మెడలో చైన్ కొట్టేసేందుకు ప్రయత్నం
స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత



బాధితురాలి నుంచి వివరాలు తీసుకుంటున్న పోలీసులు

ఆకివీడు, ఏప్రిల్ 15: ఆకివీడులో ఒక హోటల్లో పని చేస్తున్న మహిళ పని ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో ఒక వ్యక్తి దాడి చేసి మెడలో బంగారు తాడు కొట్టేయాలని ప్రయత్నించాడు. స్థానికులు పట్టుకుని పోలీసు లకు అప్పగించారు. ఆకివీడుకు చెందిన కరక రమణ తన అమ్మతో కలిసి స్థానిక హెచ్‌పీ బంకు సమీపంలో నివాసముంటోంది. హోటల్‌లో పనిచేసు కొంటూ జీవనం సాగిస్తున్నది. రోజూ మాదిరిగానే హోటల్లో పని ముగిసిన తరువాత ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారిపై ఒక వ్యక్తి రమణను బెదిరించి ఆమె దగ్గరున్న రూ.1500 నగదు తీసుకున్నాడు. మెడలో ఉన్న బంగారు తాడును తెంచేందుకు ప్రయత్నిస్తుండగా గట్టిగా కేకలు వేసింది. దీంతో ఆమె చీరతో మెడకు చుట్టి కేకలు వేయకుండా ఊపిరాడకుండా చేశాడు. అంతటితో ఆగకుండా ఆమె తలపై రాయితో కొట్టాడు. సమీపంలో ఉన్న యువకులు వచ్చి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రమణ నుంచి ఎస్ఐ బత్తిన నాగబాబు వివరాలు తెలుసుకున్నారు. తలకు మూడు కుట్లు పడి గాయం ఇబ్బంది పెడుతుండడంతో ఆమెను మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి చేసిన వ్యక్తి గుంటూరుకు చెందినవాడని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆకివీడులో చైన్ స్నాచింగ్..

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు రాధాకుమారి

ఆకివీడు, ఏప్రిల్ 15: మోటారు సైకిల్‌పై ఇంటికొస్తున్న భార్య, భర్తలను వెంబడించి మహిళ మెడలో బం గారం తాడు గుంజుకొనే సమయంలో బాధితురాలు కింద పడడంతో త్రీవ గాయాలయ్యాయి. ఆకివీడుకు చెందిన చెల్లింకల రాధాకుమారికి వారం రోజులు క్రితం పన్ను పోటు రావడంతో భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నది. ఆదివారం రాధాకుమారి భర్త శ్రీనివాసుతో కలిసి మందులు కోసం గణపవరం వెళ్లి కాపవరం మీదుగా ఆకివీడు తిరిగి వస్తున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో గుమ్ములూరు రోడ్‌లోని గాలిబ్ చెరువు సమీపంలోని చర్చి దగ్గరకు వచ్చేసరికి వెనకాల ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి వెనుక కూర్చున్న రాధాకుమారి మెడలో బంగారం తాడు గుంజుకోపోయాడు.పెనుగులాటలో ఆమె కిందపడిపోయింది. రాధాకుమారి ఎడమకాలుకి తీవ్ర గాయాలవడంతో సీహెచ్‌సీలో జాయిన్ చేసి పోలీసులకు భర్త శ్రీనివాసు ఫిర్యాదు చేశారు. రాధాకుమారి కాలుకు లోపల నాలుగు, బయట 13 కుట్లు పడ్డాయి. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏలూరు తూర్పువీధినకు చెందిన కాలవ అంజిరత్నకుమార్ (55) ఈనెల 13వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద తన మోటారు సైకిల్‌ను పార్కింగ్ చేస్తుండగా ఒక లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు టుటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.


కదులుతున్న రైలు ఎక్కబోయి యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 15: తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ వద్ద రైలుకు ప్లాట్‌ఫారానికి మధ్య చిక్కుకుని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు. ధవళేశ్వరానికి చెందిన కె.మహేష్ కుమార్ (32) విజయవాడ వెళ్తూ తాడేపల్లిగూడెం రైల్వేస్టేసన్ వద్ద మంచినీళ్ల బాటిల్ కోసం కిందకు దిగాడు. అయితే రైలు బయలుదేరి పోవడంతో పరిగెత్తుకుంటూ రైలు ఎక్కబోయి ప్లాట్‌ఫాంకు, రైలుకు మధ్య పడి నలిగి పోయాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

పూళ్ళ వద్ద రోడ్డు ప్రమాదం..యువకుడికి గాయాలు

భీమడోలు, ఏప్రిల్ 15 : భీమడోలు మండలం పూళ్ల వద్ద సీఎం కోసం ఎదురుచూసిన యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కైకరం గ్రామానికి చెందిన గుండు నరేష్ అనే యువకుడికి తీవ్ర గాయాలవగా ఏలూరులోని ఆసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనాల విస్తృత తనిఖీ



ముసునూరు, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసింది. సోమవారం ముసునూరు, రమణక్కపేట, వేల్పుచర్ల గ్రామాల శివారుల్లో స్క్వాడ్ హెడ్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, అక్రమంగా మద్యం, నగదు,తాయిలాలు రవాణా చేస్తూ పట్టుపడితే వాహ నాలను సీజ్ చేస్తామని శ్రీనివాసరావు హెచ్చరించారు.



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న బడేటి చంటి

కోడి కత్తి డ్రామాకు తెర తీశారు : బడేటి చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 15: జగన్ మరో కోడి కత్తి డ్రామాకు తెర తీశారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. నగరంలోని 5, 37, 38 డివిజన్స్‌లో సోమవారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకుని సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. ఎన్నికల్లో కూటమి తరపున తనను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడని అన్నారు. గత ఎన్నికల్లో కోడికత్తి మాదిరి ఇప్పుడు గులకరాయి డ్రామాను ప్రజల ముందుకు తెచ్చాడని అన్నారు. సానుభూతి ద్వారా ఓట్లు లబ్ధిపొందాలని కొత్త డ్రామాలకు తెర తీశారని విమర్శించారు. ఓటమి భయంతో ఇలాంటి వేషాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని ఓటు ద్వారా జవాబు చెబుతారన్నారు. కార్యక్రమంలో శివ ప్రసాద్, కాశీనరేష్, అమరావతి అశోక్, దాసరి ఆంజనేయులు, ప్రభాకర్, కార్పొరేటర్ పృధ్వీ శారధ, ఈతకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయంపల్లిలో చింతమనేని రాధారాణి

భర్త కోసం భార్య ప్రచారం..

పెదవేగి, ఏప్రిల్ 15: ఎన్నికల్లో పోటీ చేస్తున్న చింతమనేని ప్రభాకర్‌ను గెలిపించాలని అయన భార్య రాధారాణి ప్రచారం చేపట్టారు. బాబు వస్తేనే ప్రజల బతుకులు బాగవుతాయని ఆమె అన్నారు. న్యాయంపల్లిలో సోమవారం ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేవన్నారు. వైసీపీ పాలన దాడులు, దౌర్జన్యాలతో సాగుతోందని, వైసీపీని ఇంటికి పంపించడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. బొప్పన సుధాకర్, దావులూరి శ్రీనివాసరావు, కొమ్మిన సత్తిబాబు, కొడాలి రవిబాబు, కొమ్మిన శశికళ, దావులూరి సునీత, రావూరి నాగమణి, పెద్దిన రాజ్యలక్ష్మి, కొమ్మిన లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో సొంగా రాజారత్నం ప్రచారం

తనయుడి కోసం తండ్రి..

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ తండ్రి రాజారత్నం పట్టణంలో సోమవారం ప్రచారం చేపట్టారు. 15వ వార్డులో టీడీపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొంగా రోషన్ కుమార్ తండ్రి రాజారత్నం టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమర్తి రామ్‌కుమార్, మండవ లక్ష్మణరావు, చెరుకూరి శ్రీధర్, తూటికుంట రాము, కరుటూరి రమాదేవి, నంబూరి రామచంద్రరాజు, నాయుడు శ్రీనివాస్, చేను ప్రసాద్, పాతూరి అంబేద్కర్, కంచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గుండుగొలను కుంటలో మద్దిపాటి నేతల ప్రచారం

వైసీపీ చీప్ ట్రిక్స్ : మద్దిపాటి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15: ఓటమి భయంతో జగన్‌మోహన్ రెడ్డి గులకరాయి నాటకాన్ని తెరపైకి తెచ్చారని, ఇటువంటి చీప్ ట్రిక్స్‌తో అయన గ్రాఫ్ పడిపోతోందని గోపాలపురం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మండలంలోని గుండుగొలనుకుంటలో పార్టీ మండలాధ్యక్షుడు లంకా సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. టీడీపీ కూటమిని గెలిపించి ప్రజలు సంక్షేమానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పాకలపాటి గాంధీ, మొగతడకల శ్రీనివాసరావు, దాకారపు నరసింహమూర్తి, వెంకన్నబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.



తాడువాయి బీసీ సభలో నేతల అభివాదం

బీసీలకు టీడీపీ అధిక ప్రాధాన్యం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15: బీసీలకు టీడీపీ అధిక ప్రాధాన్యం ఇస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అన్నారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు బూసా సత్యన్నారాయణరెడ్డి అధ్యక్షతన సోమవారం తాడువాయిలో జయహో బీసీ సమావేశం న్విహించారు. దాసరి శ్యామ్ చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 300 మంది బీసీపై దాడులు జరిగాయన్నారు. రూ.75 వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రూ.1.50 లక్షలు బీసీ సబ్‌ప్లాన్ నిధులు వెచ్చించి బీసీలకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. బీసీలకు కల్యాణ లక్ష్మి పథకంలో క్రింద రూ.1లక్ష, 50 ఏళ్లకే రూ.4వేలు పెన్షన్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కనికళ్ల శ్రీను, కొడవటి సత్తిరాజు, పున్నగంటి అనీల్, ఎస్ఎస్ ఇస్మాయిల్, ఉప్పునూతుల పుల్లారావు, కుక్కల మాధవరావు, గంట శ్రీనివాస్, చెరుకూరి శ్రీధర్, గండే పద్మ, గోలి అనిల్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, శీలం రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సొంగా రోషన్‌కుమార్

పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం : రోషన్

లింగపాలెం, ఏప్రిల్ 15: పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో సోమవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై చేరుతుందని, తాగునీటి సమస్య అధికంగా ఉందని స్థానికులు సమస్యలు ఏకరువు పెట్టారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో కల్తీ మద్యాన్ని పంచుతున్నాడని అక్కాచెల్లెమ్మల తాళిబొట్లను తెంచేస్తున్నాడన్నారు. అనంతరం గ్రామంలో బీసీ గర్జన కార్యక్రమం నిర్వహించారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున్ రావు, ముసునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, శాకమూడి శ్రీనివాసరావు, అబ్బూరి శివరామ్, కాకర్ల వెంకటేశ్వరరావు, రాయంకుల చక్రధరరావు, గారపాటి బుజ్జియ్య, పిల్లల శ్రీనివాస్ యాదవ్, అసిలేటి అజయ్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, బీసీనేతలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చింతమనేని ప్రభాకర్

వైసీపీ అరాచకాలు భరించలేకే టీడీపీలో చేరిక

పెదవేగి, ఏప్రిల్ 15: వైసీపీ అరాచకాలు భరించలేకే ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరుతున్నామని జగన్నాధపురం వైసీపీ నాయకులు అన్నారు. గ్రామానికి చెందిన కండెపు రాజారావు, గౌతమ్, వెంకటేశ్వరరావు, రాటాలు, సాయి, చిన్న రాటాలు, దుర్గాప్రసాద్, శశి, నాగేంద్ర, వెంకట్ సహా పలు కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వారికి చింతమనేని ప్రభాకర్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గడచిన ఐదేళ్లుగా గ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, అదే పార్టీకి చెందినవారైనా ప్రశ్నిస్తే కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ వస్తేనే తమ పిల్లలకు భవిష్యత్ ఉంటుందని వారు చెప్పారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజన్ ఉన్న చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజల సంక్షేమం మెరుగవుతుందని అన్నారు. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపడుతుందని, సంక్షేమం అంటే ఏమిటో ప్రజలు చూస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పర్వతనేని పూర్ణచంద్రరావు, చిలకలపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



దొంతవరం, పొట్టిపాడు గ్రామాల్లో పర్యటించిన పత్సమట్ల ధర్మరాజు

కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు

జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ధర్మరాజు

ఉంగుటూరు, ఏప్రిల్ 15: ఎన్నికలలో కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు మండలం దొంతవరం, పొట్టిపాడు గ్రామాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం వెనక్కి పోయిందని, ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాగుపాడు మాజీ సర్పంచ్ కడియాల రవిశంకర్, దొంతవరం మాజీ సర్పంచ్ శీరెడ్డి నరసింహారావు, కాకర్లమూడి మాజీ సర్పంచ్ గుండుబోగుల సురేష్, వీఏ.పురం సర్పంచ్ శింగులూరి ధర్మారావు, ఇమ్మణ్ణి గంగాధరరావు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



వట్లూరులో జయహో బీసీ కార్యక్రమం

బీసీలకు అండగా టీడీపీ : చింతమనేని

పెదపాడు, ఏప్రిల్ 15: బీసీలకు అండగా వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేసేది టీడీపీయేనని చింతమనేని ప్రభాకర్ అన్నారు. వట్లూరులో సోమవారం రాత్రి జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఇబ్బందులేనన్నారు. ముఖ్యమంత్రిపై రాయి దాడి వాస్తవమైతే జగన్ స్వయంగా ప్రజలకు వివరించాలని, డీజీపీ, నిఘా విభాగం చీఫ్ తక్షణమే బాధ్యతల నుంచి తప్పుకోవాలని చింతమనేని ప్రభాకర్ డిమాండ్ చేశారు. అనంతరం జయపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం తేమ శాతం పరిశీలించిన వ్యవసాయాధికారి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు, ఏప్రిల్ 15: సూరప్ప గూడెంలో వరి కోతలు పూర్తయి ఆరబోసిన ధాన్యంలో తేమశాతాన్ని జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా పరిశీలించారు. సోమవారం ఆయన ఆర్బీకేలను సందర్శించి గోనె సంచులు, తేమశాతం టెస్టింగ్ విధానాన్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి ఆర్బీకేల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలిపారు. తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉండేలా చూసుకోవాలని రైతుల నుంచి ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ఉషారాణి, టెక్నికల్ ఏవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు. మండలంలో ఇప్పటివరకూ 6410 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని 13 ఆర్బీకే కేంద్రాల్లో 5 లక్షల వరకూ గోనెసంచులు అందుబాటులో ఉంచామని ఇప్పటికే వరకూ ఆర్బీకే కేంద్రాల్లో 5,086 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని అధికారులు తెలిపారు.

బొర్రంపాలెంలో ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

టి.నరసాపురం, ఏప్రిల్ 15: బొర్రంపాలెంలో గ్రామ దేవతల ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ముత్యాలమ్మ, గంగానమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు వేద పండితులు వెంపరాల ఉమా మహేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విగ్రహాల దాత బొమ్మగాని బాలకృష్ణ దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని చేశారు. పూజా కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బూరుగువాడలో సీతారామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠ



సీతారామచంద్రుల విగ్రహాలు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 15: బూరుగువాడ గిరిజన గ్రామంలో నిర్మించిన ఆలయంలో సీతారామచంద్రుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. స్వామి వారి కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పెన్మెత్స భాస్కరరాజు, ఆరవల్లి శ్రీనివాసమూర్తి, చారుగుల్ల సత్యనారాయణ, కుంజా భూమయ్య, పంగల రాముడు, కూసం మంగరాజు, బట్టా బాబురావు, బట్టా గంగరాజు, కొండేపాటి రామకృష్ణ, కొనకళ్ళ వెంకటేశ్వరావు, తోట రామకృష్ణ, ఎ.బాబురావు, రమేష్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15: పట్టణంలోని సీతారాముల ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు పూజా కార్యక్రమం అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. 17న ఉదయం సుప్రభాత సేవ, గ్రామోత్సవం స్వామి వారి కల్యాణమహోత్సవం జరగుతుందన్నారు. 18న శ్రీపుష్పయాగం పవళింపుసేవ, 19న అన్న సమారాధన అనంతరం ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించి, కార్యక్రమములు తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈవో ఆకుల కొండలరావు తెలిపారు

దాహం.. దాహం



వాటర్ ట్యాంకర్ కోసం ఎదురుచూస్తున్న కాలనీ మహిళలు

తాగు నీరందక ఏలూరు సుంకరవారి తోట ఇందిరాకాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. నీటి కష్టానికి అధికారుల వైఫల్యమే కారణమని ఆ కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఇందిరాకాలనీలో మూడు రోజులుగా కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తాగునీటిక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆదుకుంటారని ఎదురుచూస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం మంచినీరు లేక వాటర్‌క్యాన్‌లు తెచ్చుకుని వాడుకోవాల్సివస్తోందని వాపోతున్నారు. - ఏలూరు రూరల్

నామినేషన్ దాఖలుపై అవగాహన



రాజకీయ నేతలతో మాట్లాడుతున్న ఖాజావలి

ఉంగుటూరు, ఏప్రిల్ 15: నామినేషన్ల ప్రక్రియలో తప్పిదాలు లేకుండా దరఖాస్తులు పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి ఎస్‌కే. ఖాజావలి రాజకీ పార్టీల నేతలకు సూచించారు. ఉంగుటూరులో వివిధ రాజకీయ పక్షాలతో సోమవారం సమావేశం నిర్వహించారు. దరఖాస్తుదారు క్రిమినల్ కేసులు, ఇతర వివరాలు నామినేషన్‌లో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో నేతలు ఉండవల్లి బాలానందం, శరణాల మాలతీరాణి, గుత్తికొండ కృష్ణారావు, చింతలపాటి కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి నామినేషన్ ప్రక్రియ

దెందులూరు, ఏప్రిల్ 15: నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులకు నెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆర్వో, జేసీ లావణ్య వేణి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసేవారు ఈ నెల 18 నుంచి నామినేషన్ దాఖలు చేయవచ్చని ఆమె తెలిపారు. తహసీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు



లింగపాలెంలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలో పోలీస్ యంత్రాంగం విస్తృతంగా వాహన తనిఖీ చేపట్టారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 31 ప్రత్యేక తనిఖీ బృందాలు తమ పరిధిలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు.

● లింగపాలెం: లింగపాలెంలో హార్టికల్చర్ ఏడీ జె.శాంతి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను ఆపి తనిఖీ నిర్వహించారు. రూ.50వేలకు మించి నగదు, ఓటర్లకు పంచే సామగ్రి, మద్యం అక్రమ రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కానిస్టేబుల్స్ రాజు, మధు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 : మద్యంతాగి మోటారు వాహనం నడిపిన వ్యక్తికి వారం రోజులు జైలు శిక్ష విధిస్తూ ఏలూరు బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ కెవి రామమహేశ్వరి తీర్పు చెప్పారు. ఏలూరుకు చెందిన నరవా దినేష్ (22) మద్యం తాగి మోటారు వాహనం నడిపాడు. ఏలూరు రూరల్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో అతడిని పట్టుకున్నారు. అతడిని బెంచ్ కోర్టుకు సోమవారం హాజరుపర్చగా వారం రోజులు జైలు శిక్ష విధించారు.

ఎన్జీవో నేతలకు వైద్య ఉద్యోగుల సత్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15: వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాస్, ఎస్.రామారావును సోమవారం వైద్య ఉద్యోగులు సత్కరించారు. తమ సర్వీసులను రెగ్యులర్ చేయడానికి ఎన్జీవో నేతలు ఎంతగానో శ్రమించారని వారన్నారు.

హిమోఫీలియా బాధితులకు అవగాహన సదస్సు



బాలికతో సొసైటీ ప్రతినిధులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15: వంశపారంపర్య వ్యాధి హిమోఫీలియాపై విజయవాడ చాప్టర్ హిమోఫీలియా సొసైటీ ఆధ్వర్యంలో సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. హిమోఫీలియా వైద్యనిపుణులు చైతన్యకుమార్, వంశీకృష్ణ, వీణ మాట్లాడుతూ తల్లి లేదా తండ్రి నుంచి ఈ వ్యాధి పిల్లలకు సంక్రమించే అవకాశాలను వివరించారు. బాధితులు వైవాహిక జీవితం, తదనంతర పరిణామాలగురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా అవగాహన కలిగించారు. గర్భస్థసమయంలో శిశువు ఆరోగ్యంగా ఉండడానికి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాధితులు మానసిక దృఢసంకల్పంతో ఉండాలని, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వైద్య పరిశోధనలతో హిమోఫీలియా నియంత్రించడానికి లేదా నిర్మూలించడానికి అవకాశాలున్నాయని వివరించారు. సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ ఎంబీఎస్‌వీ.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వందలమంది బాధితులకు సేవచేస్తూ వారిని శారీరకంగా వ్యాధినుంచి రక్షించడమే కాకుండా, మానసికంగా ధైర్యాన్ని నింపి వారి భవిష్యత్తుపై ఆశలను సజీవంగా నిలిపేందుకు కృషిచేస్తున్నామన్నారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 500మంది హిమోఫీలియా బాధితులు హాజరయ్యారు. మానవత స్వచ్ఛంద సంస్థ నాయకులు వెంకటేష్ గురూజీ, కళాశాల కరస్పాండెంట్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాము, హెల్త్‌సెంటర్ కోఆర్డినేటర్ భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై దాడికి డీజీపీ బాధ్యతవహించాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15: ముఖ్యమంత్రిపై దాడికి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యత వహించాలని, కేసు సీబీఐకి అప్పగించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఎన్ని డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అస్తవ్యస్త పాలనతో ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్ దాడి నాటకంతో సానుభూతి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు ద్వారా పేద ప్రజల్లో వెలుగులు రాబోతున్నాయని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెల నిరు ద్యోగ భృతి రూ.1500 ఇస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15వేలు, అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తామన్నారు. సమావే శంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్, యడ్లపల్లి ఏడుకొండలు, గంటా శ్రీను, తానిగడప నరేష్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కంకిపాటి భార్గవ, కోట రమేష్, యంత్రపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రబీర్ పుర్కాయస్త పుస్తకం ఆవిష్కరణ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 15: ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అలుపెరగని పోరాటం చేసి ప్రబీర్ పుర్కాయస్త జీవితంపై రచించిన పుస్తకాన్ని ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణ ఆవిష్కరించారు. సీఐటీయూ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గూడిపాటి జూరసింహారావు మాట్లాడుతూ పుస్తక రచయిత 1975లో మీసా పేరుతో అరెస్టు అయ్యారని అన్నారు. ఆ సమయంలోనే ఎమర్జెన్సీని ఎదుర్కోవల్సిందేనా అన్న పుస్తకం రాశారన్నారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు, ప్రముఖ లాయర్ ఓరుగంటి శైలజ పాల్గొన్నారు.

25 మంది వలంటీర్లు రాజీనామా

కుక్కునూరు, ఏప్రిల్ 15: మండలంలో 25 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. అమరవరం, శ్రీధరవేలేరు, మారేడుబాక, వింజరం సచివాలయ పరిధిల్లో గ్రామ వలంటీర్లుగా పని చేస్తున్న వారంతా రాజీనామాలు ఎంపీడీవోకు అందజేశారు. తొండిబాక సచివాలయ పరిధిలో కూడా వలంటీర్ల రాజీనామా చేసినట్టు సమాచారం. గత రెండు రోజులుగా వలంటరీల రాజీనామా పరంపర కొనసాగుతుంది.

చేబ్రోలులో ముగ్గురు వలంటీర్లు..

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో సోమవారం ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారు. మండలంలో 476 మంది వలంటీర్లు ఉండగా ఇప్పటి వరకు 144మంది రాజీనామా చేసినట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధితురాలికి టీడీపీ చేయూత

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు కోడి గూడెంలో టీడీపీ ఆధ్వర్యంలో పార్టీనేతలు రూ.4500 ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొదమ రాజమణి రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. పార్టీ నేత చంద్రరావు, సురేష్, పుల్లయ్య తదితరులు బాధితురాలికి నగదు అందించి ధైర్యం చెప్పారు.

● ఏలూరు రూరల్: కిడ్నీ బాధితుడికి రివర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. ఏలూరు కొత్తపేటకు చెందిన రాయిగుంగాదర్‌రావు తన రెండు కిడ్నీలు పాడయ్యాయి. నిరుపేద కావడంతో ఆర్థికస్తోమత లేకపోవడంతో రివర్ చారిటబుల్‌ట్రస్ట్ తమ ఔదార్యాన్ని చాటుకుంది. రూ.20వేలు చెక్కును బాధితుడికి అందజేసింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన వెంకన్న క్షేత్రంలో జోరుగా ఉపనయనాలు



ద్వారకా తిరుమలలో ఉపనయనం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15: చిన వెంకన్న క్షేత్రంలో సోమవారం ఉపనయనాలు, అన్నప్రాసన కార్యక్రమాలు అధికంగా జరిగాయి. పాత కల్యాణమండప ఆవరణ, అనివేటి మండప ప్రాంతంలోను జరిగాయి. దీంతో క్షేత్రం భక్తజనులతో సందడిగా మారింది.

కోదండరామ కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 15: కట్టా సుబ్బారావు వీధిలోని కోదండ రామాలయం వద్ద కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారి జన్మ నక్షత్రమైన పునర్వసు కావడంతో ఉత్సవ విగ్రహాలకు, రామలింగేశ్వరస్వామి వారికి శివకేశవ అభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు 16న స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి రథంపై ఊరేగిస్తా మని కమిటి సభ్యులు తెలిపారు. 17న కల్యాణ మహోత్సవం, 18, 19 తేదీలలో లలితా పారాయణ, 20న పవళింపు సేవ, 21న భక్తులకు అన్న సమారాధన ఉంటుందని వివరించారు.

నగరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పోలవరం, ఏప్రిల్ 15: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ప్రతిష్ఠించిన నగరేశ్వరస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏకవార రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, భస్మార్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ మాట్లాడుతూ నిత్యం నగరేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో సిరపారపు రేణుకేశ్వరరావు దంపతులు, రజిని ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

రామభక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ

కుక్కునూరు, ఏప్రిల్ 15: భద్రాచలం రామయ్య దర్శనం కోసం పాద యాత్రగా వెళ్తున్న భక్తులకు పలువురు సేవలందించారు. కుక్కునూరులోని రామాలయం వద్ద ఉడతాబత్తుల శంఖుబాబు అన్నప్రసాదాన్ని అందించారు. జై శ్రీరామ్ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. దాదాపు 2వేల మంది భక్తులు భద్రాచలం తరలివెళ్తున్నారు.



భీమడోలులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం



జంగారెడ్డిగూడెంలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జంగారెడ్డిగూడెం ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహం సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బస్టాండ్ సెంటర్‌లో సోమవారం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు వంట చేసేటప్పుడు గ్యాస్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

● భీమడోలు: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని అగ్నిమాపక అధికారి నాగరాజు సూచించాడు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా భీమడోలు జంక్షన్‌లో పలు విన్యాసాలు నిర్వహించారు. ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు వహించాలని అధికారులు సూచించారు.

● ఏలూరు క్రైం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా అదనపు అగ్నిమాపక శాఖాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏలూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏలూరు రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో ప్రయాణికులకు కరపత్రాలు అందించి అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో తెలియజేశారు. అంతేకాకుండా అగ్ని ప్రమాదం సంభవిస్తే దానిని నియంత్రించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేసవి కాలంలో నిప్పు పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా తాగిన సిగరెట్లను ఆర్పకుండా పడవేయకూడదని, ఇంట్లో గ్యాస్ స్టౌపై వంట అయిపోగానే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. మోటారు సైకిళ్లను ఎండలో పార్కింగ్ చేయకూడదని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు

సీఎం పర్యటనలో భద్రతా చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం చుట్టూ ఫెన్సింగ్

ఉంగుటూరు, ఏప్రిల్ 15: సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నారాయణపురం సెంటర్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తాత్కాలిక మరమ్మతులు చేసి ఇనుప కంచెను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. సొసైటీ మలుపులో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేశారు. ముఖ్య మంత్రి వ్యక్తిగత భద్రతకు సంబంధించి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కైకరం, చేబ్రోలు, నారాయణపురం సెంటర్ ప్రాంతాలలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 24.0

టిడ్కో ఉచిత ఇళ్లను మరిచారా?


భీమవరంలో అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్లు

సీఎం జగన్ ఇచ్చిన హామీకి ఐదేళ్లు


పోలంగిలో ఇళ్ల (ఫైల్)

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఏపీ టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇస్తామంటూ గత ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోండి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే రుణాలు చెల్లిస్తుంది. ఇది మీ జగనన్న హామీ అంటూ భీమవరంలో ప్రకటించారు. కానీ ఎన్నికల హామీని నెరవేర్చలేకపోయారు. మళ్లీ ప్రస్తుత ఎన్నికల్లో భాగంగా బస్సు యాత్రలో సీఎంగా భీమవరం వస్తున్నారు. గతంలో జగన్ ఇచ్చిన హామీలను నియోజకవర్గ ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. ఇచ్చిన హామీని కాకుండా వైసీపీ ప్రభుత్వం కేవలం 300 చదరపు అడుగుల ఇళ్లకే పరిమితం చేసింది. అదే 365, 430 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లకు రాయితీ వరకే పరిమితం చేశారు. ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. దీనివల్ల లబ్ధిదారులపై దాదాపు రూ.4.65 లక్షల భారం పడింది. బ్యాంకు రుణాలు చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే 75 శాతం నిర్మాణం పూర్తయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల వరకు రాయితీ ఇచ్చాయి. మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేలా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లబ్ధిదారులు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారు. మడమ తిప్పారు. కేవలం 300 చదరపు అడుగుల ఇళ్లకు మాత్రమే ఉచితం అమలుచేశారు. అంతేతప్ప 365, 430 చదరపు అడుగుల ఇళ్ల విషయంలో చేతులెత్తేశారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకున్నారు. ఇళ్లు అందజేయకుండానే బ్యాంకుల నుంచి వాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసే పరిస్థితి నెలకొంది.

టిడ్కో ఇళ్ల నిర్మాణం ఇలా

ఏపీ టిడ్కో భీమవరంలో 8,352, పాలకొల్లులో 6,144 ఇళ్లు, తాడేపల్లిగూడెంలో 5,376 ఇళ్లు నిర్మిస్తున్నారు. అందులో 300 చదరపు అడుగుల ఇళ్లు 6,944 ఉన్నాయి. వాటికే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. అదే 365, 420 చదరపు అడుగులకు సంబంధించి మూడు పట్టణాల్లో 12,249 ఇళ్లు ఉన్నాయి. వారందరికీ ప్రభుత్వం ఉచిత హామీ నెరవేర్చలేదు. బ్యాంకు రుణాలు చెల్లించాల్సి వస్తోంది.

రంగులకే పరిమితం

వైసీపీ హయాంలో రంగులు మార్చేందుకు ప్రభుత్వం పరిమితమైంది. ఉన్న రంగులను మార్చింది. తెలుపు, నీలం రంగులు అద్దింది. ఇందుకు కోట్ల రూపాయలు వెచ్చించింది. తెలుగుదేశం హయాంలో పూర్తి చేసిన ఇళ్లకు రంగులు మార్చడం వివాదాస్పదమైంది. తాడేపల్లిగూడెంలో 71 బ్లాక్‌లు, భీమవరంలో 32, పాలకొల్లులో 52 బ్లాక్‌లు టీడీపీ హయాంలోనే సిద్ధమయ్యాయి. ఒక్కో బ్లాక్‌లో 32 ఇళ్లు ఉన్నాయి. అప్పట్లోనే రంగులు వేశారు. అవి ఆకర్షణీయంగా ఉన్నాయి. సదరు ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి మూడేళ్లు పట్టింది. ఆ తర్వాత మరో నాలుగు వేలు ఇచ్చారు. ఇప్పటికీ లబ్ధిదారులు ఆ ఇళ్లలోకి వెళ్లలేదు. పూర్తిస్థాయి వసతులు లేకుండానే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించారు. వారి చేతిలో పట్టాలు పెట్టారు.

ఏలూరు జిల్లాలో అస్తవ్యస్తం

ఏలూరులో టిడ్కో ఇళ్లు అధ్వానంగా మారాయి. ఇళ్లల్లో పుట్టలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయి. పిచ్చి చెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో పథకంలో 6,480 గృహాలు నిర్మాణాలను ప్రారంభించారు. 4,272 గృహాలు నిర్మాణం ఫౌండేషన్ స్థాయిలోనే ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి లబ్ధిదారులను భయపెట్టి జగనన్న కాలనీలో సెంటు భూమిని కట్టబెట్టారు. లబ్ధిదారులు 430 గజాల ఇళ్లకు రూ.లక్ష, 365 గజాల ఇళ్లకు రూ.50 వేలు, 300 గజాల గృహాలకు రూ.500 ప్రభుత్వానికి చెల్లించారు. బ్యాంకులలో వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్టు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం 300 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు, 1104, 365 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 384, 400 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 720 కాగా మొత్తం 2,208 గృహాలే లబ్ధిదారులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అదికూడా మళ్లీ ఎన్నికల తర్వాతే లబ్ధిదారులకు అప్పగిస్తామని అధికారులు చెప్పడం గమనార్హం. నూజివీడులో సుమారు రూ.250 కోట్లు వ్యయంతో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీల పేరుతో 4,030 టిడ్కో జీ+3 ఇళ్లు మంజూర య్యాయి. ఇందులో లబ్ధిదారుడి వాటా చెల్లించిన వారికి టీడీపీ ప్రభు త్వం దిగిపోయే సమయానికి 2,630 టిడ్కో జీ+3 గృహాలను దాదాపు 80 శాతం పూర్తి చేశారు. 2019 తొలి నాళ్లల్లో జీ+3 భవనాలను లబ్ధిదారులకు కేటాయింపు జరిగింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ టిడ్కో భవనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో భవనాల నిర్మాణం ఆగిపోయింది. నిర్మాణాలపై తెలుగుదేశం, జనసేన, వామపక్ష పార్టీలు ఆందోళన బాట పట్టడంతో ఫిబ్రవరి మొదటి వారంలో గత టీడీపీ హయాంలోనే పూర్తయ్యి రంగులు వేసిన భవనానికి వైసీపీ రంగులు వేసి భవన నిర్మాణాలు వేగంగా, తమ హయాంలో జరుగుతున్నట్టు చూపే ప్రయత్నం చేయడం గమనార్హం. జంగారెడ్డిగూడెంలో 2016లో 864 టిడ్కో గృహసముదాయాల నిర్మాణం మొదలుపెట్టారు. 2019 ఎన్నికలు సమీపించే సమయానికి నిర్మాణాలు చివరి దశకు వచ్చాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాకా నేటి వరకు మిగిలిన నిర్మాణ పనులు అడుగు ముందుకు కదల్లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తేదీలు మార్చుకుంటూ ప్రజలను మభ్యపెట్టారు.

లబ్ధిదారుల వాటాలోనూ అంతే..

ప్రభుత్వం 365, 430 చదరపు అడుగులకు సంబంధించి లబ్ధిదారుల వాటాలో కొంత రాయితీ ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి 365 చదరపు అడగుల ఇళ్ల లబ్ధిదారులు రూ. 50 వేలు, 430 చదరపు అడుగుల ఇళ్ల లబ్ధిదారులు రూ.లక్ష వంతున చెల్లించారు. అందులో చెరి సగం ప్రభుత్వం తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ఇప్ప టికీ లబ్ధిదారుల వంతులో ప్రభుత్వం సొమ్ములు మంజూరు చేయలేదు. బ్యాంకుల నుంచి లబ్ధిదారులపై ఒత్తిడి పెరుగుతోంది.

శ్రావణంలో గృహ ప్రవేశం : చంద్రబాబు

తెలుగుదేశం అధికారంలోకి వస్తే శ్రావణ మాసంలోనే ఇళ్లల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు పాలకొల్లు సభలో హామీ ఇచ్చారు. వాస్తవానికి క్రీడా మైదానాలు, పార్క్‌లు వంటివి ఏర్పాటు చేయాలని టీడీపీ సంకల్పించింది. అవన్నీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారు. కనీస వసతులు కల్పించలేకపోయారు. టిడ్కో ఇళ్లు చిట్టడవులను తలపిస్తున్నాయి. మళ్లీ ఎన్నికల సభకు సీఎం జగన్ వస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదంటూ లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు.


పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

హైవేలోనూ జనానికి తిప్పలే

సీఎం జగన్ పర్యటనలో భారీ భద్రత

- బస్సులో నుంచి కదలకుండానే చేతులూపిన జగన్.. హైవేపై 'ఫ్యాన్' కార్యకర్తలకు చుక్కలు
- జనం పల్చగా, వాహనాల శ్రేణి పెద్దగా..

పెదవేగి/పెదపాడు/ఏలూరు క్రైం/దెందులూరు/భీమడోలు/ఉంగుటూరు, ఏప్రిల్ 15 : మేమంతా సిద్ధం పేరిట సీఎం జగన్ ఎన్నికల ప్రచారయాత్ర ఏలూరు జిల్లాలో అడుగిడింది. బస్సులో సీఎం జగన్ ప్రయాణిస్తుండగా అయన వెంటే పెద్దసంఖ్యలో వాహనాలు అనుసరించాయి. గులకరాయి దాడి తర్వాత కనీవిని ఎరుగని రీతిలో భద్రతా బలగాల మధ్య సోమవారం రాత్రి హనుమాన్ జంక్షన్ నుంచి నారాయణపురం వరకు సీఎం జగన్ బస్సులో ప్రయాణించారు. ఏలూరు జిల్లా సరిహద్దు అప్పనవీడు దాటి హైవేలో ప్రవేశించిన కాన్వాయ్ కలపర్రు టోల్‌గేట్ వద్ద కొన్ని నిమిషాలపాటు ఆగింది. అప్పటికే ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల నుంచి కొద్దిపాటి సంఖ్యలో కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరిగి 48 గంటలు దాటిన తర్వాత పోలీస్, భద్రతా బలగాలు పెద్దఎత్తున మోహరించాయి. గతంలో మాదిరిగా కాకుండా వైసీపీ వారైనా ఎక్కడ లేని జాగ్రత్తలు తీసుకున్నారు. ఉత్సాహంతో ముందుకెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను నిలువరించారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద అప్పటికే ఎమ్మెల్యేలు ఆళ్ళ నాని, కొఠారు అబ్బయ్యచౌదరి కార్యకర్తలు వెంటరాగా అక్కడకు చేరుకున్నారు. వారిద్దరు సీఎం ప్రయాణిస్తున్న బస్సులోకి వెళ్ళారు. ఆపై జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ బస్సు ఎదుటే సీఎం జగన్‌కు గుమ్మడికాయ దిష్టి తీశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ హోదాలో పద్మశ్రీని మాత్రమే ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అనుమతించారు. మిగతా వారిని బస్సు సమీపంలోకి రానీయకుండా నెట్టివేశారు. ఉన్న కొద్దిపాటి కార్యకర్తలకు ఈ చర్యలు రుచించలేదు. కలపర్రు టోల్‌గేట్ వద్ద మాత్రమే జనం పల్చగా హాజరయ్యారు. ఆ తర్వాత సీఎం కాన్వాయ్ హైవేపై దూసుకుపోయింది. ఇంతకు ముందు కొద్దిపాటి మందే కార్యకర్తలు ఉన్నా వారిని చూసి అభివాదం చేసే సీఎం ఈసారి బస్సులోనే ఉండిపోయారు. ప్రత్యేకించి ఆయన ప్రయాణిస్తున్న మార్గం జాతీయ రహదారి కావడంతో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి, దెందులూరు క్రాస్ రోడ్డు, కొవ్వలి క్రాస్‌రోడ్డు, సత్యనారాయణపురం.. ఎక్కడా కూడా ఆగకుండానే హైవే మీదే ముందుకు సాగారు. సర్వీస్ రోడ్లలోను ఎక్కడా జనమే కనిపించలేదు. రాత్రివేళ కావడంతో వీరంతా ముందస్తుగా కలపర్రు టోల్‌గేట్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు వెళ్ళినట్టు వైసీపీ నేతలు మాట ఏమార్చారు. లంకల గ్రామాలకు చెందిన కొద్దిపాటి మందిని గుండుగొలను జంక్షన్‌కు జగన్ రాకకు కొన్నిగంటల ముందే స్థానిక నేతలు రప్పించారు. ఎక్కడా ప్రసంగాలు, ఓదార్పులు లేకుండానే నిర్దేశిత వ్యవధికంటే జగన్ పర్యటన గంటన్నర ఆలస్యంగా సాగింది. దీంతో వచ్చిన కొద్దిమంది గంటల తరబడి వేచిఉండాల్సి వచ్చింది. భీమడోలు రైల్వే క్రాసింగ్ వద్ద వేచిఉన్న కొద్దిపాటి జనాన్ని కూడా జగన్‌ను కలవనీయకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. పూళ్ళ సెంటర్‌లోనూ కాస్తో కూస్తో జనం ఉన్నా సీఎం కాన్వాయ్ ముందుకే సాగింది. కైకరం, నారాయణపురం జంక్షన్లలో రాత్రి హైవే మీదే సీఎం కోసం పడిగాపులు పడడమే కాకుండా విపరీతమైన భద్రతా కారణాల దృష్ట్యా అటు నుంచి ఇటు, ఇటు నుంచి ఎవరినీ కలవనీయకుండా చేశారు. హనుమాన్ జంక్షన్ నుంచి కైకరం వరకు సుమారు 51 కిలోమీటర్లు గంటంపావు వ్యవధిలోనే సీఎం కాన్వాయ్ ప్రయాణించింది.


కలపర్రు టోల్‌గేట్ వద్ద కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు


భీమడోలులో అరకొరగా వున్న జనానికి బస్సులో నుంచే జగన్ అభివాదం

నారాయణపురం టు ఈతకోట

- ఉమ్మడి పశ్చిమలో సీఎం జగన్ బస్సు యాత్ర.. నేడు భీమవరంలో సిద్ధం సభ
- నియోజకవర్గానికి 150 బస్సులు.. పది వేల మంది తరలించాలని ఆదేశాలు
- ఆర్టీసీ నుంచి 140 బస్సుల కేటాయింపు

భీమవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం భీమవరంలో 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించనున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకున్న సీఎం సోమవారం రాత్రి బస ఇక్కడే చేయనున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నారాయణపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. నిడమర్రు, భువనపల్లి మీదుగా పది గంటలకు గణపవరం చేరుకుంటుంది. తర్వాత సరిపల్లె, కోలమూరు మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు ఉండి చేరుకుని మధ్యాహ్న భోజనం చేస్తారు. అక్కడి నుంచి సాయంత్రం నాలుగు గంటలకు యాత్ర ప్రారంభించి 4.30 గంటలకు భీమవరం చేరుకుంటారు. బైపాస్ రోడ్‌లోని జీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలను తరలించేందుకు అధికార పార్టీ నేతలు తలమునకలయ్యారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 150 బస్సుల్లో జనాన్ని తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీకి ఇచ్చేందుకు ఆర్టీసీ సైతం 140 బస్సులను కేటాయించింది. ప్రతి నియోజకవర్గం నుంచి పది వేల మందికి తక్కువ కాకుండా జనం హాజరయ్యేలా చూడాలని అధిష్ఠానం నుంచి ఆదేశాలందాయి. ఇందు కోసం అభ్యర్థులంతా ఆపసోపాలు పడుతున్నారు. భీమవరంలో సభ అనంతరం గరగపర్రు-ఉణుదుర్రు, ముదునూరు రావిపాడు మీదుగా బస్సు యాత్ర తణుకు చేరుతుంది. తణుకు వై.జంక్షన్ నుంచి పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఈతకోటకు చేరుకుని అక్కడ రాత్రి బస చేస్తారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

ఉండి, ఏప్రిల్ 15 : సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ వి.రజిత తెలిపారు. సోమవారం ఉండి కోట్ల ఫంక్షన్ హాలులో సీఎం బస్సు యాత్రకు సంబంధించి పోలీసులకు అవగాహన కల్పించారు. సీఎం భద్రతకు సుమారు 1500 మంది పోలీసులను ఏర్పాటు చేశారు.

హైవేలోనూ తప్పని తిప్పలు..

ఇంతకు ముందు నిర్దేశించిన కార్యక్రమం ప్రకారం గుడివాడ, భీమవరం మార్గంలో సీఎం జగన్ మేమూ సిద్ధం యాత్ర చేయాల్సి ఉంది. కానీ సీఎంపై గులకరాయి దాడి జరిగిన తర్వాత షెడ్యూల్ మార్చారు. హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు జిల్లాలోకి కాన్వాయ్ రూట్‌ను మళ్లించారు. దీంతో సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు హైవేలోనే జనం తిప్పలు పడక తప్పలేదు. సీఎం ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు, ప్రైవేట్ వాహనాలకు మధ్య ముప్పావుగంట వ్యవధి ఉండేలా పోలీసులు జాగ్రత్తలు పడడంతో ప్రయాణికులు చుక్కలు చూశారు. ఆఖరికి సర్వీసు రోడ్లలోనూ వాహనాలను వెళ్లనీయకుండా అత్యుత్సాహంతో నిలువరించారు.

టీచర్ల వైద్యబిల్లుల చెల్లింపునకు లైన్‌క్లియర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 15 : ఉద్యోగ, ఉపాధ్యాయుల వైద్యబిల్లుల మంజూరు, చెల్లింపు (రీయింబర్స్‌మెంట్)పై ఖజానా శాఖ అధికారులు పెడుతున్న అభ్యంతరాలను పరిష్కరిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యబిల్లులను ఆమోదిస్తూ గతంలోనే వైఎస్సార్ ట్రస్ట్ ఉత్తర్వులు జారీచేయగా, వాటిని తిరస్కరిస్తూ సంబంధిత శాఖల హెచ్‌వోడీల నుంచి మంజూరు ఉత్తర్వులు జారీ అయితేనే చెల్లింపులు జరుగుతాయని ట్రెజరీ అధికారులు మెలిక పెట్టారని వివరించారు. ఈ సమస్యపై పీఆర్టీయూ చేసిన అభ్యర్థన మేరకు పాఠశాల విద్యలో పెండింగ్‌లో వున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల్లో తొలివిడతగా 1,350 మంది టీచర్ల బిల్లులు చెల్లించాల్సిందిగా కమిషనర్ ఉత్తర్వులిచ్చారన్నారు. ఉత్తర్వులను ఎంఈవోలు/ హెచ్‌ఎంల లాగిన్‌లకు పంపినందున సీఎస్‌ఈ ప్రొసీడింగ్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులను స్థానిక ఖజానాశాఖ అధికారులకు మంజూరు, చెల్లింపు నిమిత్తం టీచర్లు అందజేయాలని కోరారు.

ఇరిగేషన్ ఎస్ఈగా రవిబాబు



ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15 : ఏలూరు జలవనరుల శాఖ ఏలూరు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఎం.ఎస్. ఎస్ రవిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

చింతలపూడి, ఏప్రిల్ 15 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వైపే తమంతా ఉన్నామని జిల్లాలోని పామాయిల్ రైతులు స్పష్టం చేశారు. ఏలూరు ఎంపీ స్థానం కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ చింతలపూడి మండలం ఊటసముద్రంలో పామాయిల్ రైతులతో సమావేశమయ్యారు. రైతుల సమస్యలను ఆసాంతం విన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. క్రూడాయిల్ దిగుమతితో సంబంధం లేకుండా పామాయిల్ టన్నుకు గిట్టుబాటు ధరను అందిస్తామన్నారు. తనను పార్లమెంట్‌కు పంపిస్తే అక్కడ పామాయిల్ సమస్యలు వివరించి కేంద్రంతో మాట్లాడి ప్రతీ మూడేళ్లకు ఒకసారి గిట్టుబాటు ధర పెరిగేలా కృషి చేస్తామన్నారు. మొక్కలు కొనుగోలులో ప్రభుత్వం నుంచి సబ్సిడీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. పామాయిల్ పంటను మన రాష్ట్రానికి తీసుకొచ్చింది మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని అన్నారు. అనంతరం చంద్రబాబు పామాయిల్ పంట అభివృద్ధికి కృషి చేశారన్నారు. చంద్రబాబు 33 నెలల మ్యాచింగ్ గ్రాంట్ రైతులకు ఇచ్చారని దాన్ని జగన్ రద్దు చేశాడన్నారు. మరలా మ్యాచింగ్ గ్రాంట్ పునరుద్ధరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, రైతులు రామారాజు, ఆచంట సూర్యనారాయణ, ముత్తారెడ్డి, పాల్గొన్నారు.


ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మహేష్ యాదవ్, రోషన్‌కుమార్‌ను సత్కరిస్తున్న పామాయిల్ రైతులు

టీడీపీతోనే బీసీలకు న్యాయం : యనమల

దెందులూరు : 'బీసీలకు న్యాయం చేయగలిగే పార్టీ టీడీపీ మాత్రమే. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి' అంటూ మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ నేత యనమల రామ కృష్ణుడు పిలుపునిచ్చారు. దెందులూరు మండలం గంగన్నగూడెం శ్రీకృష్ణ కన్వెన్షన్ హాలులో సోమవారం ఏలూరు పార్లమెంట్ స్థానం పరిధిలోని యాదవ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. సమావేశానికి హాజరైన యనమల మాట్లాడుతూ బీసీలంతా ఐక్యతతో ఉండి టీడీపీ కూటమి విజ యానికి కృషి చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ జగన్‌కు ఓటేస్తే మన ఆస్తులకు మన భూములకు గ్యారంటీ ఉండదని, తల్లి, చెల్లి కుటుంబ సభ్యులకే న్యాయం చేయలేని జగన్‌ను మళ్లీ నమ్మితే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోతుందన్నారు. బీసీ కులా లతో పాటు యాదవుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసి, అధికారంలో అగ్రభాగం అవకాశం కల్పించిన తెలుగుదేశం కూటమికే మా మద్దతు పలుకుతామని యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ ముమ్మడి సక్కు కుమారి, చింతయ్య యాదవ్, రాష్ట్ర యాదవ సంఘం నాయకులు ప్రకటించారు. దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు నాగనబోయిన సత్యనారాయణ, జమలయ్య యాదవ్, వెంకటేశ్వరావు, మహేష్ యాదవ్, నున్న లక్ష్మణ్, ముమ్మడి వినయ్ యాదవ్, కొలుసు నాని, వేగివాడ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.


గంగన్నగూడెం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ యనమల


వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు (సర్కిల్‌లో)

వైసీపీ సమావేశంలో వలంటీర్లు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన గ్రామ వలంటీర్లు అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొం టున్నారు. ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేస్తున్నా, ఎన్నికల సంఘం వద్దని చెబుతున్నా ఏదో కార్యక్రమంలో పాల్గొంటూనే ఉన్నారు. సోమవారం సారథి ఫంక్షన్ హాల్లో జరిగిన వైసీపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అయితే ఈ సమావేశానికి పలువురు వలంటీర్లు హాజరు కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాల్వలు కట్టేలోపు మంచినీటి వనరులన్నింటినీ నింపుకోవాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 15 : కాల్వలు కట్టే లోపు జిల్లాలోని మంచినీటి వనరులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన నింపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో వేసవి తాగునీటి సరఫరా, ఎన్నికల సంసిద్ధతపై అధికారులతో సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.